ప్రజాశక్తి

శనివారం 10 ఆగస్టు 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

టిడిపి చేతికి కార్పొరేషన్ పగ్గాలు.!

- వచ్చే వారంలో పచ్చ కండువా కప్పుకోనున్న మేయర్
- కార్పొరేషన్ పాలకవర్గంపై పట్టు సాధించడంలో ఎమ్మెల్యే జనార్ధన్ సక్సెస్

దామచర్ల జనార్ధన్‌ను కలిసిన మేయర్ సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు కార్పొరేషన్ పరిపాలన తెలుగుదేశం పార్టీ చేతిలోకి వెళ్లనుంది. వైసిపి చేతిలో ఉన్న పాలనా పగ్గాలు టిడిపి చేతిలోకి రానున్నాయి. కార్పొరేషన్ టిడిపి ఖాతాలో చేరనుంది. మరికొద్ది రోజుల్లోనే ఈ మార్పులు జరగనున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కార్పొరేషన్ పాలనను తమ చేతిలోకి తీసుకోవడానికి అవసరమైనంత మంది కార్పొరేటర్ల మద్దతు తెలుగుదేశం పార్టీ కూడగట్టింది. సాక్షాత్తు మేయర్ గంగాడ సుజాత తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. టిడిపిలో ఆమె చేరికకు మార్గం సుగమమైంది. వచ్చే వారంలో ఆమె వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు సమాచారం. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మరి కొంతమంది కార్పొరేటర్లు కూడా మేయర్‌తో పాటే తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఒంగోలు కార్పొరేషన్‌లో వైసిపికి 43 మంది కార్పొరేటర్లు ▶ 2లో

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌కెఎం, కార్మిక సంఘాల నాయకులు

కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించండి

ఎస్‌కెఎం, కార్మిక సంఘాల ధర్నా

5లో ▲

విద్యార్థినులు క్రీడలలో రాణించాలి

శ్రీ సరస్వతి విద్యా సంస్థల ఛైర్మన్ ఏవి రమణారెడ్డి - క్రీడలతో మానసిక వికాసం - శ్రీ సరస్వతిలో మెగా స్పోర్ట్స్ వీక్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థినులు క్రీడలలో రాణించాలని శ్రీ సరస్వతి విద్యా సంస్థల ఛైర్మన్ ఏవి రమణారెడ్డి సూచించారు. చెరుటుఅకొమ్ముపాలెం శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో 8వ మెగా స్పోర్ట్స్ వీక్ శుక్రవారం ప్రారంభమైంది. ఖో-ఖో, వాలీబాల్, రింగ్ ఆట, కబడ్డీ, షటిల్, చదరంగం వంటి క్రీడలను నిర్వహించనున్నారు. మెగా స్పోర్ట్స్ వీక్‌ను ప్రారంభించిన ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు చిన్నతనం నుంచి క్రీడలు ఆడాలని, క్రీడలతో శారీరక, మానసిక వికాసం లభిస్తుందని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు సైతం గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చినవారేనని తెలిపారు. క్రీడలలో

స్పోర్ట్స్ వీక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, తద్వారా జీవితంలో రాణించటానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థినులను తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రపతి, కలెక్టర్, ఒంగోలు మేయర్ అంతా మహిళలేనని, మహిళలు సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. విద్యార్థినులు క్రీడలలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మెగా స్పోర్ట్స్ వీక్ నిర్వహించటం ఎంతో కష్టంతో కూడుకున్న పని అని, స్పోర్ట్స్ వీక్‌ను నిర్వహించటానికి సహకరించిన శ్రీ సరస్వతి విద్యా సంస్థల డైరెక్టర్లు ఏ గంగా శంకర్‌రెడ్డి, సిఇఒ ఎన్ సురేష్‌ను అభినందించారు. శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పద్మావతి బ్రాంచ్ విద్యార్థినులు రంగుల బట్టలతో చేసిన ఆకృతులు, శ్రీ సరస్వతి బ్రాంచ్ విద్యార్థినులు ఆసనాలతో చేసిన ఆకృతులు విశేషలంగా అలరించాయి.

టిడిపి చేతికి 'కార్పొరేషన్' పగ్గాలు.!

(మొదటిపేజీ తరువాయి)

దామచర్ల జనార్దన్ సమక్షంలో టిడిపిలో చేరుతున్న అంబటి ప్రసాద్‌రావు

ఉండగా ఒక్కొక్కరిగా ఆ పార్టీని వీడుతున్నారు. ఈ పరిణామం ఒంగోలులో వైసిపిని మరింత సంక్షోభంలోకి నెట్టినట్లయ్యింది.

27 మంది ఉంటే టిడిపి చేతికి పాలన..

ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. 50 మంది కార్పొరేటర్లు ఉన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం ఎన్నికల్లో ఒంగోలు ఎమ్మెల్యే ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి ఎక్స్‌అఫిషియో సభ్యుల హెూదాలో ఓటు హక్కు ఉంటుంది. మొత్తం కార్పొరేషన్‌లో పాలకుల ఓట్లు 53. ఇందులో 27 ఓట్లు ఏ పార్టీకి ఉంటే ఆ పార్టీ చేతిలోకి పరిపాలన వెలుతోంది. కార్పొరేషన్‌లో స్వతహాగా తెలుగుదేశం పార్టీకి 6 మంది కార్పొరేటర్లు ఉన్నారు. జనసేనకు ఒక కార్పొరేటర్ ఉన్నారు. జనసేనతో తెలుగుదేశం పార్టీ కూటమి కట్టడంతో ఆ సంఖ్య కాస్తా 7కు చేరింది. సాధారణ ఎన్నికలకు ముందు వైసిపినీ వీడి ఐదు మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. దీంతో తెలుగుదేశం పార్టీ బలం 12కు చేరింది. ఎన్నికల తరువాత ఇప్పటి వరకు వైసిపిని వీడి టిడిపి కండువా కప్పుకున్న కార్పొరేటర్లు మరో ఐదు మంది ఉన్నారు. అంటే ఇప్పటి వరకు తెలుగుదేశంకు మద్దతుగా ఉన్న కార్పొరేటర్ల సంఖ్య 17 అయ్యింది. మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, వారితోపాటు సుమారు మరో 10 మంది వచ్చే వారంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. ఈ సంఖ్య ఇంకాస్త పెరిగే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఎటు తిరిగి కార్పొరేషన్ పాలనను చేతిలోకి తీసుకోవడానికి కావల్సినంత మంది కార్పొరేటర్ల మద్దతు తెలుగుదేశం పార్టీ కూడగట్టింది. దీంతో తెలుగుదేశం పార్టీ చేతిలోకి ఒంగోలు కార్పొరేషన్ పరిపాలన పగ్గాలు వెళ్లడం ఇక లాంఛనమే..! కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలంటే అందుకు అవసరమైన కోరం సాధించేందుకు 36 మంది కార్పొరేటర్లు అవసరం. ఏ పార్టీకి చెందిన కార్పొరేటర్లు అయినా కౌన్సిల్ సమా వేశానికి 36 మంది హాజరైతే సమావేశం జరుపుకోవచ్చు. వైసిపి కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాకపోయినా తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చే వారి సంఖ్య కౌన్సిల్‌లో 36 మంది ఉండేలా, తద్వారా కౌన్సిల్ సమావేశం జరుపుకునేలా ఎమ్మెల్యే జనార్ధన్ పావులు కదుపుతున్నారని సమాచారం.

మేయర్‌కు లభించిన అభయమేమిటో.?

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, ఒంగోలులో ఎమ్మెల్యేగా దామచర్ల జనార్ధన్ విజయం సాధించడంతో ఒంగోలులో వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేకించి వైసిపిలో ఉన్న కీలకమైన కార్యకర్తల కంటే కార్పొరేటర్లే టిడిపి కండువాలు కప్పుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతుండటం విశేషం. ఈ క్రమంలో మేయర్ గంగాడ సుజాత కూడా పార్టీ మారుతారన్న ప్రచారం గడిచిన రెండు నెలల కాలంలో ఎక్కువగా జరిగింది. మేయర్ వైసిపిని వీడి వెళ్లరని, ఆమె మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి నమ్మకస్తురాలు అనే చర్చ కూడా జరిగింది. అయితే తాజాగా మేయర్ రెండు, మూడు ధపాలుగా ఎమ్మెల్యే జనార్ధన్‌ను కలవడం, ఆ తరువాత ఆమె టిడిపిలో చేరుతున్నట్లు సన్నిహితులకు, కొంతమంది కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వడం జరిగిపోయింది. దీంతో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు గానూ మేయర్ సుజాతకు ఎమ్మెల్యే జనార్ధన్ ఇచ్చిన అభయమేమిటనే చర్చ కార్పొరేషన్ వర్గాలలో జోరుగా జరుగుతోంది. కార్పొరేషన్‌లో ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం సుమారు మరో ఏడాదిన్నర ఉంది. ఈ ఏడాదిన్నర కూడా మేయర్‌గా గంగాడ సుజాతనే కొనసాగించేందుకు ఎమ్మెల్యే జనార్ధన్ గట్టి హామీ ఇచ్చినట్లు మేయర్ సన్నిహితులు చెబుతున్నారు. దీంతో రానున్న ఏడాదిన్నరపాటు ఆమె తెలుగుదేశం పార్టీ మేయర్‌గా కొనసాగుతారన్న చర్చ ఈపాటికే ప్రారంభమైంది. మొత్తంగా వైసిపి చేతిలో ఉన్న ఒంగోలు కార్పొరేషన్ పాలనను టిడిపి చేతిలోకి తీసుకోవడంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సఫలీకృతులయ్యారని చెప్పొచ్చు.

విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలు

అరికట్టాలని పార్లమెంట్‌లో కోరిన ఎంపి మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విదేశీ ఉద్యోగాల పేరిట జరిగే మోసాలను అరికట్టాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. శుక్రవారం పార్లమెంటు సమావేశాలలో ఈ విషయమై ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారు మాట్లాడుచూ దేశం నుండి ఇతర దేశాలకు ఉపాధి- ఉద్యోగాల కోసం వెళ్ళే ప్రజలను ఆయా దేశాలకు పంపించేందుకు కొందరు దళారులు చేసే మోసాలు సైబర్ సంబంధిత అక్రమ రవాణాలతో ఇతర దేశాలలో వారు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఓ మధ్య పాశ్చాత్య దేశంలో రాష్ట్రానికి చెందిన కొంత మంది దళారులతోమోసగించబడి, విపరీత బాధలకు గురై, తిరిగి రాష్ట్రానికి చేర్చమని ఇటీవల అభ్యర్ధన చేశారన్నారు. ఈ విషయమై రాష్ట్ర మావన వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ అభ్యర్ధన, కేంద్రం చొరవతో వారు రాష్ట్రానికి సురక్షితంగా చేర్చారన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వానికి ఎంపి మాగుంట కత్ఞతలు తెలియజేశారు. అలాంటి దళారుల మోసాలు మరలా జరగకుండా కేంద్రం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిని కోరారు. స్పందించిన కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్ సమాధానమిస్తూ మిడిల్ ఈస్ట్ దేశాలకు వెళ్లి మోసపోయినవారి సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ ముందు ఉందని, తరువాత కర్నాటక, కేరళ, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయన్నారు. ఇలాంటి మోసాలు దళారుల నుంచి జరగకుండా అరికట్టడం కేంద్ర - రాష్ట్రాల ఉమ్మడి చర్య అని, మోసాలు చేసిన దళారుల వివరాలు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సమాధానమిచ్చారు.

క్విట్ ఇండియా డే స్ఫూర్తితో

ఎల్ఐసి పరిరక్షణకు ఉద్యమించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎల్ఐసిని దెబ్బతీసేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు క్విట్ ఇండియా డే స్ఫూర్తితో ఉద్యమించాలని ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా డే సందర్భంగా ఒంగోలులోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఎల్ఐసిఎఐఒ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే బాలచంద్రం, నెల్లూరు డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి వెంకటరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎల్ఐసి అత్యంత ముఖ్యమైన బ్రాండ్‌లలో మూడో స్థానంలో ఉందన్నారు. ప్రజలకు ఆర్థిక భరోసాను, సామాజిక భద్రతను అందించడమే కాకుండా దేశానికి ఉపయోగపడే అనేక ప్రాజెక్టులకు ఆర్థిక సహకారాన్ని ఎల్ఐసి అందిస్తుందన్నారు. అటువంటి ఎల్ఐసి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి తోడ్పాటుని అందించాల్సింది పోయి దానిని దెబ్బతీసి అంబానీ ఆదానీలపరం చేసేందుకు మోడీ ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియంకు జిఎస్‌టి రద్దు చేయాలని, ఎల్ఐసిలో ఐపిఒను ఉపసంహరించాలని, ఎల్ఐసిలోకి కార్పొరేట్ల ప్రవేశాన్ని నిషేధించాలని, ఎల్ఐసి డబ్బుతో కొన్న ఐడిబిఐ బ్యాంకును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, నూతన ఇన్సూరెన్స్ బిల్లును ఉపసంహరించాలని, పాలసీదారులకు, ఏజెంట్లకు, ఎల్ఐసి సంస్థకు నష్టం కలిగించే ఐఆర్‌డిఎఐ నూతన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఐసిఇయు నాయకులు సంఘీభావం తెలిపి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు ఎం వెంకటేశ్వర్లు, సిహెచ్‌వి సుబ్బారెడ్డి నాయకులు ఆర్ శ్రీనివాసరావు, కె వెంకటేశ్వర్లు, బివి రమణయ్య, కె రమణారెడ్డి, డి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సిఐల బదిలీ

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు ఐజి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల రూరల్ సర్కిల్ సిఐగా బి.హరికష్ణ, ఇంకొల్లు సీఐగా వైవి రమణయ్య, మార్టూరు సిఐగా జిఎల్.శ్రీనివాసరావును బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒంగోలు ట్రాఫిక్ సిఐగా పాండురంగారావు

విఆర్‌లో ఉన్న పాండురంగారావును ఒంగోలు ట్రాఫిక్ సిఐగా నియమిస్తూ గుంటూరు ఐజి ఉత్తర్వులిచ్చారు.

'మోడల్' విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మోడల్ స్కూల్‌ను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. మోడల్ స్కూల్‌కు ప్రహరీ నిర్మాణం కోసం పంచాయతీరాజ్ అధికారులతో కలిసి పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. త్వరితగతిన ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. వసతి గృహం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు లేకుండా నిధుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. ఆదర్శ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ ఆదిశేషు, ఏఈ తిరుపాలయ్య, టిడిపి నాయకులు నారపరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు 'కందుల' ఆశీర్వాదం

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని కుంచేపల్లి గ్రామ సర్పంచ్ వరికుంట్ల కాంతమ్మ - దేవిడ్‌ల కుమార్తె, రాష్ట్ర తెలుగు విద్యార్థి ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్‌కుమార్ (పండు చికెన్) చెల్లెలు చిరంజీవి నీతు కుమారి-రవి రాజ్ వివాహ నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను మార్కాపురం శాసనసభ్యులు నారాయణరెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ సైదా, పొదిలి మండల టిడిపి నాయకులు కాటూరి నారాయణ ప్రతాప్, గునుపూడి భాస్కర్, ఆవులూరి యలమంద, మిగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా కుర్దుష్, సామంతుపూడి నాగేశ్వరరావు, ఎస్‌కె రసూల్, యాసిన్ జిలాని, తాడికొండ వెంకట్రావు, మీగడ ఈశ్వర్‌రెడ్డి, తాటిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెరికె సుఖదేవ్ బూన్, ముని శ్రీను, ఎమ్మెల్యే తనయుడు కందుల విగ్నేష్‌రెడ్డితో పాటు పొదిలి, కెకెమిట్ల, మర్రిపూడి మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గద్దె ఏడుకొండలు అన్నారు. మండలంలోని అరివేముల ఆయుర్వేద వైద్యశాలలో శుక్రవారం రోగులకు వైద్య చికిత్సలు అందజేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద మందులు వాడడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయన్నారు.

CHANGE OF NAME

I, **THATAGIRI DURGA PRASAD**, (Old Name) **S/o. ANJAIAH**, Resident of Chalappalem Village, Mynampadu Post, Santhanuthalapadu Mandal, Prakasam District - 523225, Andhra Pradesh. I have changed my name from **THATAGIRI DURGA PRASAD** to **THATIGIRI DURGA PRASAD** (New name), **S/o. ANJANEYULU**. Here after my name is known as **THATIGIRI DUGA PRASAD, S/o. ANJANEYULU** as per affidavit dated 08/08/2024 before Public Notary, Ongole.

పంచాయతీలో అవినీతిపై విచారణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ సర్పంచి తాటిపర్తి వనజ ఆధ్వర్యంలో పంచాయతీ నిధుల్లో అవినీతి జరిగినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ గత సోమవారం ఒంగోలు నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్‌ను ఆదేశించారు. అందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచి తాటిపర్తి వనజా, గతంలో పనిచేసిన 9 మంది అధికారులను విచారించారు. జనసేన అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ అందుబాటులో లేనందున అతని తరుపున వసంతయ్య వివరాలు అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో

విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్

15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ. 33 లక్షలు, మరో రూ. 13 లక్షలు స్టార్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు రామ్మోహన్, శరత్, ఇన్‌ఛార్జిగా పని చేసిన ఇఒఆర్‌డి అంజలీదేవి, జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన శైలజ, పంచాయతీ రాజు ఏఇ కోట శ్రీహరి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ కిషోర్, సర్పంచి వనజాను, గతంలో విచారణ జరిపిన ఒంగోలు డిఎల్‌పిఒ పద్మ, కనిగిరి డిఎల్‌పిఒ శోభన్‌బాబును విడివిడిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ. కుమార్ విచారించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జనసేన అధ్యక్షుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి వివరాలను సేకరించారు. అన్ని రకాల వివరాలతో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని విచారణ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి అందరమూ కృషి చేద్దామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శ్రీ రంగనాథ ట్రేడర్స్ అధినేత కొత్తూరి శ్రీ రంగనాయకులు, టిడిపి నాయకులు మద్దసాని బ్రహ్మయ్య నూతన గృహప్రవేశ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ టి.భాగ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందినట్లు ఆమె తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని తెలిపారు. ఈ సందర్భంగా

భాగ్యలక్ష్మిని అభినందిస్తున్న మంత్రి

మంత్రి స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, చీమకుర్తి కృష్ణ, మించల బ్రహ్మయ్య, సుదర్శి ప్రసాదరావు, ఇమ్మడిశెట్టి రామారావు, మందలపు గాంధీచౌదరి, నక్కా బ్రహ్మేశ్వరరావు, పాములూరి మాధవరావు, పోనూరి నరేష్, కనిగిరి వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసరావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, పులి ప్రసాద్ పాల్గొన్నారు.

సోనా బోట్ల సమస్యను పరిష్కరిస్తాం

జిల్లా మత్స్యశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తమిళనాడు ప్రభుత్వంతో మాట్లాడి సోనా బోట్ల సమస్యను పరిష్కరించి మత్స్యకారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పాకల తీరంలో సోనా బోట్లు హల్‌చల్ అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ఓ వార్త ప్రచురితమైంది. వార్తకు జిల్లా మత్స్యశాఖ అధికారి స్పందించారు. తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు బోట్లు నిబంధనలు ఉల్లంఘించి హద్దు దాటి వస్తున్నాయన్నారు. ఈ విషయం గురించి మత్స్యశాఖ ద్వారా ఏపీ ఫిషరీస్ కమిషనర్‌కు తెలియజేసినట్లు తెలిపారు. కమిషనర్ ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈ ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు మధ్య వేటకు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఇదే కథనంపై శింగరాయకొండ మత్స్యశాఖ అధికారి ఎస్‌విఎస్. వర్షిణి కూడా స్పందించారు. సోనా బోట్ల విషయం గురించి జిల్లా అధికారులకు సమాచారం తెలియసినట్లు ఆమె తెలిపారు. జిల్లా అధికారి ఏ.చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఏపీ ప్రభుత్వంతోపాటు మత్స్యశాఖ కమిషనర్‌కు లేఖ పంపి చర్చలు తమిళనాడు ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరినట్లు ఆయన తెలిపారు.

సరళను వేధించి.. కొట్టి చంపారు

- మృతురాలి బంధువుల ఆరోపణ

- వైద్యశాల వద్ద ఆందోళన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సంగ్రపాటి సరళను ఆడబిడ్డలు, అత్తా, మొగుడు వేధించి కొట్టి చంపారని మృతురాలి బంధువులు ఆరోపించారు. యర్రగొండపాలెం మండలం గోళ్లవిడిపి గ్రామంలో సంగ్రపాటి సరళ (24) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని సరళ అత్తామామలు తెలిపిన విషయంలో నిజం లేదని ఆమె బంధువులు ఆరోపించారు. సరళ చనిపోయిందన్న వార్త తెలియడంతో ఆమె బంధువులు శుక్రవారం భారీ సంఖ్యలో యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వచ్చారు. ఆందోళన చేశారు. కేవలం ఆడబిడ్డలు, అత్తా, మొగుడు మానసికంగా వేధించి కొట్టి చంపారని తెలిపారు. మొదటి నుంచి సరళ ఆడబిడ్డల పోరు పడలేనని తమకు చెబుతుండని ఆరోపించారు. కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారని వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. సిఐ రాముల

వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

నాయక్ జోక్యం చేసుకొని దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళనను విరమించజేశారు. యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో సరళ బంధువులు ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకొని మార్కాపురం డిఎస్‌పి బాల సుందరరావు ఏరియా వైద్యశాలకు వచ్చి ఘటనపై ఆరా తీశారు.

మహిళకు మాయ మాటలు చెప్పి..

10 సవర్ల బంగారం అపహరణ

ప్రజాశక్తి-టంగుటూరు

గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళ వద్ద నుంచి 10 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించారు. ఈ ఘటన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కొండపి మండలం చోడవరం గ్రామానికి చెందిన బాలునేని వెంకట రమణ తూర్పునాయుడుపాలెం లోని బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి ప్రక్కన బస్సు కోసం వేచియుంది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె వద్ద వచ్చారు. రహదారిపై తనిఖీ చేస్తున్నారని, బంగారం ప్యాకింగ్ చేసి ఇస్తామని నమ్మబలికారు. దీంతో వెంకట రమణ తన ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసి వారికి ఇచ్చింది. ఆభరణాలు ప్యాకింగ్ చేసినట్లు నటించారు. చివరకు పేపరు ప్యాకెట్ ఇచ్చారు. ఇంతలో ఆటో రావడంతో ఆమె అందులో ఎక్కింది. టంగుటూరు వెళ్లిన తర్వాత ప్యాకెట్ విప్పి చూడగా అందులో బంగారు ఆభరణాలు లేదు. ఆభరణాలకు బదులుగా రాళ్లు ఉన్నాయి. దీంతో కంగుతున్న మహిళ ఈ విషయం గురించి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేసింది. అనంతరం కుటుంబ సభ్యుల సాయంతో టంగుటూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ పున్నారావు నింది తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. టంగుటూరు సమీపంలోని టోల్ ప్లాజా వద్ద సిసి కెమెరాల పుటేజి పరిశీలిస్తున్నారు. మూడు సవర్ల చైన్, ఐదున్నర సవర్ల గాజులు, ఒకటిన్నర సవర్ల కాశికాయల దండ,ఐదు గ్రాముల పచ్చరాయి ఉంగరం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితురాలు తెలిపింది.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

డిఎస్‌పి బాలసుందరరావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం గోళ్లవిడిపి గ్రామంలో గురువారం సంగ్రపాటి సరళ (24) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరకట్న

మాట్లాడుతున్న డిఎస్‌పి

వేధింపులుగా కేసు నమోదు చేసినట్లు మార్కాపురం డిఎస్‌పి ఎం. బాల సుందరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడారు. దొనకొండ మండలం మంగినపూడి గ్రామానికి చెందిన సంగ్రపాటి సరళకు నాలుగు సంవత్సరాల క్రితం యర్రగొండపాలెం మండలం గోళ్లవిడిపి గ్రామానికి చెందిన దేవదాసు అనే వ్యక్తితో వివాహం జరిగినట్లు తెలిపారు. ఆ సమయంలో రూ. 70 వేలు కట్నంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత అత్తామామలు, భర్త అదనపు కట్నం తీసుకురమ్మని సరళను వేధిస్తున్నట్లు తెలిపారు.ఆ వేధింపులు తాళలేక సరళ ఆత్మహత్య చేసుకున్నట్లు చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహశీల్దారు హరిబాబు పంచనామా నిర్వహించారన్నారు. వారి ఫిర్యాదు ఆధారంగా వరకట్న వేధింపులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలకేంద్రమైన నాగులుప్పలపాడులోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 20 అడుగుల విగ్రహాన్ని శనివారం ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు గుంపుల సుబ్బారావు, దోనెం పూడి రవీంద్రబాబు తెలిపారు. అదేవిధంగా గౌతమ బుద్ధుడు విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అంబేద్కర్ మనవడు, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావు యశ్వంత్ అంబేద్కర్ , ప్రకాశం జిల్లా మాజీ కలెక్టర్ జిఎస్ఆర్‌కెఆర్. విజయ్ కుమార్ , పలువురు ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఎంఎల్ఎ కొండయ్యను సన్మానం చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

సమాజంలో తమ వంతు సహాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఊర మస్తాన్‌రావు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య అన్నారు. ట్రస్టు నిర్వాహకులు ఊరా మస్తానరావు జన్మదిన వజ్రోత్సవం, ట్రస్ట్ రజితో త్సవం సందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల్లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిమిత్తం వచ్చే వారందరికీ అన్నదానం నిర్వహించారు. ట్రస్టు ద్వారాగా అనేక మందికి సేవలు నిర్వహిస్తున్న మస్తానరావు సేవలను అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

గిరిజనులకు అండగా నిలిచిన టిడిపి

ప్రజాశక్తి - చీరాల

గిరిజనులకు అండగా తెలుగుదేశం అన్ని వేళలా ఉంటుందని, వారందరికీ సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధికి కృషి చేస్తుందని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గిరిజనుల సంక్షేమం కోసం గతంలో గిరి గోరు ముద్దలు, పోషకాహార బుట్టలు, ఫీడర్ అంబులెన్సులు, డయాలసిస్ కేంద్రాలు, 50ఏళ్లకే పింఛన్లు వంటి ఎన్నో పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. గిరిజన ప్రగతి కోసం పోడు భూములపై హక్కులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన విశ్వవిద్యాల యం కోసం కృషి చేసినట్లు తెలిపారు. యువకుల ఉపాధి కోసం ఇన్నోవా కార్లు ఇవ్వటంతో పాటు గిరి నెట్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఏజెన్సీలోని ఉద్యోగాలు స్థానికులకే చెందేలా జిఓ నెంబర్ 3ని తెలుగుదేశం తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మురళీకృష్ణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణ సిఐగా అహమ్మద్ జానీ

ప్రజాశక్తి - బాపట్ల

సిఐ అహమ్మద్ జానీ

పట్టణ సిఐగా ఆర్ అహమ్మద్ జానీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తామని అన్నారు. ప్రధానంగా యువతను పెడదోవ పట్టిస్తున్న గంజాయిపై పట్టణంలో ఉక్కు పాదం మోపుతామన్నారు. ఇక్కడ సిఐగా పనిచేసిన ఉప్పు శ్రీనివాసరావు సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్లారు.

మండలంలో 49పాఠశాలల్లో కమిటీలు ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని 49 పాఠశాలలకు విద్యా కమిటీలు ఎంపిక చేసినట్లు ఎంఇఒ నీలం దేవరాజ్ తెలిపారు. 41 మండల పరిషత్, ఒకటి యుపి, 5 జెడ్‌పి ఉన్నత పాఠశాలలకు కమిటీలు ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తి అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్నా డి రమాదేవి

ప్రతి విద్యార్థి స్వాతంత్ర ఉద్యమ చరిత్ర పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి అన్నారు. పట్టణంలోని సరస్వతి మెమోరియల్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు స్వాతంత్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. స్వాతంత్య ఉద్యమంలో ఎంతో మంది యువకులు తమ ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. బొంబాయిలో 1942 ఆగష్టు 8న గోవాలియా ట్యాంక్ మైదాన్‌లో మహాత్మా గాంధీ తమ ప్రసంగంలో డూ ఆర్ డై అని పిలుపు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని బహిష్కరించడం, ప్రభుత్వం ప్రమేయం ఉన్న లావాదేవీలను తిరస్కరించడం వంటి కార్యాచరణతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక హింసాత్మక సంఘటనలు జరిగాయని అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం పదివేల మంది నాయకులను అరెస్టు చేసి 1945 వరకు జైలులో ఉంచారని చెప్పారు. చివరికి భారతదేశం పాలనా రహితమని బ్రిటిష్ ప్రభుత్వం గ్రహించి శాంతియుతంగా భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించాలని నిర్ణయించిందని అన్నారు. 1945లో జైలులో ఉన్న స్వాతంత్ర్య సమర యోధుల విడుదలతో క్విట్ ఇండియా ఉద్యమం ముగిసిందని అన్నారు. దీంతో 1947 ఆగస్టు 15న స్వాతంత్రం ప్రకటించారని చెప్పారు. క్విట్ ఇండియా ఉద్యమం స్వర్ణోత్సవం సందర్భంగా భారత రిజర్వ్ బ్యాంక్ రూ.1 స్మారక నాణాన్ని 1992లో విడుదల చేసింద న్నారు. నేటి విద్యార్థులు స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు టి సుభాషిని, ప్రజా సంఘాల నాయకులు జె సామ్యూల్, వై భాస్కరరావు, కె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు

ర్యాలీ నిర్వహిస్తున్న రైతు నాయకులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

కుల వివక్ష, అంటరానితనం, మతోన్మాదంకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాటానికి సన్నద్ధం కావాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ళ రామ కోటేశ్వరావు కోరారు. కేంద్రంలోని బిజెపి నిరంకుశ, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు సేవ్ ఇండియా - సేవ్ అగ్రికల్చర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్రంలోని మనువాద ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం వచ్చాక ప్రజల నుండి పన్నుల రూపంలో దోచుకుంటూ మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చి హక్కులను హరిస్తుందని ధ్వజమెత్తారు. స్వామినాథన్ కమిషన్ నివేదిక అమలు చేసి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, రైతు సంఘం నాయకులు ఎనికపాటి రాంబాబు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, రామాంజనేయులు, మోహనరావు, సూరిబాబు పాల్గొన్నారు.

ముండ్లమూరు : క్విట్ ఇండియా డే సందర్భంగా విత్ కార్పొరేట్ డేగా తహశీల్దారు కార్యాలయం వద్ద రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. రైతు సంఘం కార్యదర్శి పంట ఏడుకొండలు మాట్లాడుతూ వ్యవసాయానికి మద్దతు ధర ఇవ్వాలని కోరారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి సబ్సిడీలు పెంచాలని కోరారు. నకిలీ విత్తనాలు పురుగు మందులను నివారించాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. నూతన వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని రద్దు చేసి రైతు ఆత్మహత్యలు నివారించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని కోరారు. ఏడాదికి 200 రోజుల పని కల్పిస్తూ రోజుకు రూ.600వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని కోరారు. బి హనుమంతరావు, జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. నిరసన అనంతరం తహశీల్దారుకు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మీరావలి, నారాయణ, శ్రీనివాసరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వై జంక్షన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో వంటశాల, అర్చకుల నివాసానికై నిర్మించనున్న గదుల నిర్మాణానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరవు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గదుల నిర్మాణానికి తిమ్మసముద్రంకు చెందిన ఎన్ఆర్ఐ మన్యం శ్రీకాంత్ రూ.40లక్షల విరాళం ఆయన తల్లి, దండ్రులు మన్నెం శివ నాగేశ్వరరావు, ధర్మపత్ని వెంకటసుబ్బమ్మ పేరుతో అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఏలూరు సాంబశివరావు మాట్లాడుతూ మన్నెం శ్రీకాంత్ ఈ ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. ఎంఎల్ఎ ఏలూరు సాంబశివరావుకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయన స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఇనగల్లు గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర సచివాలయ మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ ఎంఎల్ఎ ఏలూరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోట హరి ప్రసాదు, కటారి సురేంద్ర, నర్రా వెంకట్, రంగిశెట్టి ఆంజనేయులు, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఎల్ శంకర్, ఎం కోటేశ్వరరావు, తులసి అప్పారావు, కె శేష బ్రహ్మాచారి, తులసి శివ నాగేశ్వరరావు, జనసేన రాష్ట్ర నాయకులు అలా అనిల్ కుమార్ పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ ఏలూరు సాంబశివరావు

డైనింగ్ టేబుల్ బహుకరిస్తున్న తోకల కృష్ణమోహన్

వృద్ధాశ్రమానికి డైనింగ్ టేబుళ్ల బహూకరణ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ఆశ్రయ వృద్ధాశ్రమానికి రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఐదు డైనింగ్ టేబుళ్లను శుక్రవారం అందజేశారు. ఆయన కుమార్తె తోకల మౌనిక పేరుపై వీటిని అందించినట్లు తెలిపారు. సినీ నటుడు మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని 25మంది వృద్దులకు అన్నదానం చేశారు. వృద్దులకు తోడ్పాటు అందించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రశేఖర్, కోటా హరిబాబు, మహేష్ అభిమానులు తాటి సుబ్బయ్య, నూతలపాటి సుబ్రమణ్యం, షేక్ సుభాని, ఆకుల శ్రీను, షేక్ ఆసిమ్ అక్రమ్, షేక్ రఫ్ని, షేక్ నవాబ్ జాని, ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి, రామ్మోహనరావు పాల్గొన్నారు.

మెడికల్ షాపును ప్రారంభిస్తున్న మధుసూదన ప్రసాద్

జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలానికి చెందిన ఆళ్ల సత్యనారాయణ కుమారుడు ఆళ్ల కృష్ణ భానుతేజ నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ ఆధార్ మెడికల్ షాపును రిబ్బన్ కట్ చేసి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



జడ్జితో చందలూరి నారాయణరావు

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కవి 'చందలూరి'

ప్రజాశక్తి - అద్దంకి

హైకోర్టు సీనియర్ జడ్జి యు దుర్గాప్రసాదరావు పదవీ విరమణ సందర్భంగా జరిగే సభకు వచన కవి చందలూరి నారాయణరావుకి ప్రత్యేక ఆహ్వానం అందింది. అమరావతిలో హైకోర్టు ఆవరణలో ఎపి హైకోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు సెంట్రల్ గవర్నమెంట్ కౌన్సిలర్, న్యాయవాది బాచిన హనుమంతరావు, నారాయణరావును పరిచయం చేస్తూ గతంలో కొన్ని కవితల గురించి వివరించారు. ఇంతకు మునుపే నారాయణరావు వ్రాసిన 'మనం కాసేపు మాట్లాడుకుందాం' అనే పుస్తకాన్ని చదివిన జడ్జి అభినందించారు. ఈ మేరకు సాహిత్యం పట్ల తనకున్న అభిరుచిని తెలియచేస్తూ నారాయణరావు కవితలలో ఉన్న సరళతను, చక్కని అందమైన భావ వ్యక్తీకరణ కొనియాడారు. శాలువాతో ఆయనను సన్మానించారు. ఆయన ఛాంబర్లలో ఆయనను కలసి సాహితీ స్రవంతి పక్షాన జరిగే కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంలో తనకు పాల్గొనే అవకాశం కల్పించినందుకు ాచిన హనుమంతరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించండి

- వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాలి
- ఒంగోలులో ఎస్‌కెఎం, కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించి వారి దోపిడీని అరికట్టాలని, వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాలని పలువురు సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఎస్‌కెఎం పిలుపులో భాగంగా శుక్రవారం ఒంగోలు ప్రకాశం భవనం ఎదుట జరిగిన ధర్నా జరిగింది. ధర్నా కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, ఏఐటియుసి నాయకులు పివిఆర్ చౌదరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్. లలిత కుమారి మాట్లాడుతూ బిజెపి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు, రుణాలను మంజూరు చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులకు అనుకూలమైన రుణ విమోచన చట్టం, విత్తన చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు

ధర్నా చేస్తున్న నాయకులు

చేయమంటే కనీసం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను పది రెట్లు ఎక్కువగా అమ్ముతున్న బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రజా ధనాన్ని అనేక రాయితీలు, రుణాలు పేరిట ఉదార స్వభావంతో అందిస్తున్నారని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం నోటిలో మట్టి కొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు పెంట్యాల హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, సిఐటియు నాయకులు జి.రమేష్, ఆర్ వెంకట్రావు, సి.యర్ సాగర్, ఎంఎస్ సాయి, ఎన్ నాగరాజు, యు ప్రకాష్ రావు, ధనలక్ష్మి, బి.పద్మ పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: రైతుల సంక్షేమమే తమ సంక్షేమమని పదేపదే వాగ్దానాలు గుమ్మ రించే మోడీ ప్రభుత్వం ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవ హరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ సంస్థలను బహిష్కరిం చాలని కోరుతూ కిసాన్ మొర్చా,ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు సెంటర్ లో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాసీం, నియోజకవర్గ ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పివి కొండయ్య, ఏఐటీయూసీ నాయకులు వై.వెంకట రెడ్డి, ఎల్లయ్య, సిపిఐ నాయకులు జి కాశయ్య, కెవిపిఎస్ నాయకులు జవ్వాజి రాజు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మహబూబ్

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేద విద్యార్థిని షేక్ నసీమ ఉన్నత చదువుల కోసం దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ శుక్రవారం రూ.పది వేల ఆర్థిక సాయం అందజేశారు. ఒంగోలు సత్యనారాయణపురంలో నివసిస్తున్న షేక్ ఆసిన్ అహ్మద్ షాహినా దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆయన పెయింట్ పని చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. వారి కుమార్తె నసీమ ఒంగోలు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్లో పదోతరగతిలో 567 మార్కులతో పాస్ అయింది. నసీమాకు ఒంగోలు ట్రిబుల్ ఐటీ కాలేజీలో సీటు వచ్చింది. చదువులకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతుండటంతో చదువుకు పేదరికం అడ్డు కాకూడదని దోస్తీ ఫౌండేషన్ ఆ అమ్మాయి ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించింది. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, రెడ్‌క్రాస్ ఎంసీ సభ్యులు మంగళగిరి నరసింహారావు, సయ్యద్ మస్తాన్‌బీ (టీచర్), నత్తల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

సొంత నిధులతో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో గుర్రపుశాల ఎస్సీ కాలనీలో గత రెండు నెలల నుంచి తీవ్రమైన నీటి ఎద్దడితో అక్కడి దళితులు అల్లాడిపోతున్నారు. నీటి సమస్యపై ఎంతో మంది అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన కరువైంది. గ్రామ సర్పంచ్ వాడాల పద్మ వైసీపీకి చెందిన వారు కావడంతో అధికారులు కూడా ఆమె మాటను పెడ చెవిన పెట్టారు. దీంతో గ్రామస్తులు నీటి సమస్యను టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు దష్టికి తీసుకు వెళ్లారు. ఆయన మాజీ సర్పంచ్ ముండ్ల దానియేలుకు బోర్ బిగించి సమస్యను పరిష్కరించమని తెలిపారు. దీంతో గుర్రపుశాల మాజీ సర్పంచ్ ముండ్లా దానియేలు రూ.1.20 లక్షలు తన సొంత నిధులతో బోరు బిగించి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గత రెండు నెలలు నుంచి నీటి సమస్యతో ఇబ్బంది పడిన దళితులకు సమస్యను పరిష్కరించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మామిళ్ళ యేసయ్య, మామిళ్ళ ఏలియా, ముండ్లా కోటయ్య, పల్లె మహేష్ బాబు, చేదులపల్లి ఏలియా, మామిళ్ల జేమిస్, ముండ్లా వెంకటేష్, ముండ్లా ప్రభుదాస్, మామిళ్ళ దేవ సహాయం, మామిళ్ళ ఏసు దానం, మామిళ్ళ ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి యాక్షన్‌ప్లాన్

- మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకం
- రూ.133 కోట్ల వ్యాపారమే లక్ష్యం
- అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

2047వ సంవత్సరానికి అన్ని రంగాల్లోనూ జిల్లా సమగ్ర అభివద్ధి సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఈ అభివద్ధిలో మహిళలు భాగస్వాములు కావటం అత్యంత కీలకమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ దిశగా బ్యాంకు రుణాలిచ్చి స్వశక్తి సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖలు, బ్యాంకుల అధికారులతో కలెక్టర్ శుక్రవారం ప్రకాశం భవనంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9500 మంది ఎస్‌హెచ్‌జి మహిళలతో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.133 కోట్ల పెట్టుబడితో వ్యాపారం చేయాలన్నది లక్ష్యమని తెలిపారు. ప్రతి మహిళ లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ దిశగా వారికి లక్ష్యం మేరకు రుణాలు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. పేదరికం లేని ప్రకాశం జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఆవిష్కరించటంలో బ్యాంకర్లు కూడా తమ వంతు పాత్ర పోషించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. శాఖాపరమైన, ఆర్థికపరమైన సమస్యలు ఏమైనా ఉంటే డిఆర్‌డిఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ఎల్‌డిఎంతో సమన్వయం చేసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రవికుమార్, ఎల్‌డిఎం రమేష్, నాబార్డ్ డిడిఎం రవికుమార్, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ పివి రమణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.బేబీ రాణి, పిడిసిసి బ్యాంకు చీఫ్ మేనేజర్ జి.శ్రీనివాస్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, కంట్రోలర్లు, ఇతర అధికారులు, డిఆర్‌డిఏ డిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పోషకాహార భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని జమ్మి దోర్నాల గ్రామంలో ఆహారం, పోషకాహార భద్రత, పత్తి పంటపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి డి జవహర్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ పత్తిలో సమగ్ర సస్య రక్షణలో భాగంగా గులాబీ రంగు పురుగు రాకుండా ముందుగా లింగాకర్షక బుట్టలు ఎకరానికి 10 చొప్పున ఏర్పాటు చేయాలని తెలిపారు. వేపానూనె గింజల కాషాయం, వేప నూనె పంటపై పిచికారీ చేయాలని తెలిపారు. ప్రత్తి పైరు ఈపంట నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి హరిజన నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌పితో పెద్దిశెట్టి చంద్ర, వరలక్ష్మి

ఎస్‌పిని కలిసిన 'పెద్దిశెట్టి'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఏఆర్ దామోదర్‌ను టిడిపి 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర, రాష్ట్ర తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం ఎస్‌పిని కలిసి.. మొక్కను అందజేశారు.

సెంట్రల్‌జోన్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పి.శివలక్ష్మి, ఏ.దావన్య, ఎం.స్వాతి, కె.కౌశల్య, డి.స్వాతి అథ్లెటిక్ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వి నారాయణరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రామానాయక్ శుక్రవారం తెలిపారు. అనంతపురంలో ఈనెల చివరి వారంలో జరిగే పోటీలలో వీరు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరి నాగమూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు విజయమాణిక్యం, అనసూయా దేవి, కిరణ్ కుమార్, పోలయ్య, మీటే నాయక్,

సెంట్రల్ జోన్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

చంద్రమౌళి, అవులయ్య, యోగా మస్టర్లు మహేష్‌రెడ్డి, ప్రేమ్ చంద్, గోపిరెడ్డి పాల్గొన్నారు.

విద్యా కమిటీ చైర్మన్లకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అనూష

మండలంలోని ధూపాడు గ్రామ పంచాయతీలో పరిధిలోని ఆరు పాఠశాల ల్లో విద్యా కమిటీ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన టిడిపికి చెందిన చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లకు దూపాడు గ్రామ సర్పంచ్ ఎనిబెర అనూష శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆదివాసీ దినోత్సవాన్ని నంద్యాల జిల్లా సున్నిపెంటలో ఐటిడిఏ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐటిడిఏ ఏపీవో సురేష్ శర్మ ఆదివాసి దినో త్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో గిరిజనులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గిరిజనులకు చెక్కులు, పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెవుల అంజయ్య, నిమ్మల ఈదన్న, వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడ శ్రీశైలపతి నాయుడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సామాగ్రి అందజేస్తున్న కమిషనర్ చక్రవర్తి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - చీరాల

ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి కార్మికులతో పనులు చేయిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాల మేరకు ఓపెన్ ఎయిర్ థియేటరు, ఎన్ఆర్ అండ్ పిఎం బాలుర ఉన్నత పాఠశాల ప్రక్కన పారిశుద్ధ్య కార్మికులకు బిన్స్, చీపుర్లు, పారలు, పుష్ కాట్లను శుక్రవారం అందజేశారు. అందులో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు కన్జర్వెన్సీ ఆర్టికల్స్ అందించుట వలన పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చేందుకు అవకాశం కలదని, పుష్ కాట్లు, బిన్స్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణకు, చెత్తను తరలించేందుకు అవకాశం కలదని, తద్వారా అంటు వ్యాధులు ప్రబల కుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టరు, అసిస్టెంట్ ఇంజనీరు (ఎన్విరాన్మెంట్), శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రులు, పారిశుద్ధ్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్ర ప్రదర్శనలో ఏడీఏ అక్తర్ హుస్సేన్

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఖరీఫ్ సీజన్లో రైతుల సాగుచేసిన వేద పద్ధతి వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని బాపట్ల వ్యవసాయ శిక్షణ కేంద్రం అధికారి సయ్యద్ అక్తర్ హుస్సేన్ సూచించారు. మండలంలో వెదసాగు చేసిన వరిపైరు క్షేత్ర ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. రైతులకు సూచనలు చేశారు. వెద సాగుచేసిన పంట పొలాల్లో కలుపు నివారణ చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి మోతాదుకు అనుగుణంగా ఎరువులను వాడాలని చెప్పారు. ఏఒ గొల్లపోతు మీరయ్య మాట్లాడుతూ రైతులు వెద సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నీరు అధిక మొత్తంలో లేకుండా పైరుకు అనుగుణంగా నీటిని నిల్వ చేయాలని వివరించారు.

వరద ఉధృతికి నీట మునిగిన ఇటుక బట్టీలు

మునిగిపోయిన ఇటుకబట్టీలు

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీ నుండి 3లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వదలడంతో మండలంలోని లంక గ్రామాలైన గాజుల లంక, పెసర్లంక గ్రామాల్లోని ఇటుక బట్టిలు వరద నీటిలో మునిగి పోయాయి. ఈ నీళ్లపై ఇంకా రెండు లక్షల క్యూసెక్కులు వస్తే పంట పొలాలు పాడయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతానికి గ్రామాలు పంట పొలాలకు ఎటువంటి ఇబ్బంది లేకపోయినప్పటికీ వరద పెరిగితే ముంపుకు గురయ్యే గ్రామాలను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులు చూస్తున్నారు. ముందస్తు చర్యగా కొల్లూరు, ధోనేపూడి గ్రామాల్లోని పాఠశాలలను పరిశీలించారు.

ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే ఏలూరి శ్రీకారం

- 21న రెవెన్యూ సమస్యలపై వినతుల స్వీకరణ
- రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం
- పర్చూరు మార్కెట్ యార్డు వేదికగా రెవెన్యూ దర్బార్
- హాజరు కానున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్, పర్చూరు

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు రెవెన్యూ ప్రజాదర్బార్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 21న పర్చూరు వ్యవసాయ మార్కెట్ వేదికగా చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజా దర్బార్ కొనసాగనుందని తెలిపారు. ఎంఎల్ఎ ఏలూరి సాంబశివ రావు సారధ్యంలో జరగనున్న రైతాంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించనున్న రెవెన్యూ ప్రజా దర్బారు కు ఆర్‌డిఒ, తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలు, ఇతర సిబ్బంది పాల్గొననున్నట్లు తెలిపారు. భూమి హద్దులు, ఆన్లైన్ సమస్యలు, ఆన్లైన్లో తప్పులు తడకగా ఉన్న భూములు, వివరాల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. అన్నదాతల వినతులపై స్పందించిన ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు రెవెన్యూ దర్బారు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న అపరిష్కృత రెవెన్యూ సమస్యలను తక్షణమే అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించారు. పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం తహశీల్దార్లను కార్యక్రమంలో భాగస్వాములుగా చేసి సమస్యల పరిష్కారం అయ్యేలా ప్రత్యేక ప్రణాళికలు చేశారు. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను మండలాలవారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వినతులు స్వీకరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపేలా ఆదేశాలు జారీ చేయనున్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఎంఎల్ఎ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

ఎంఎల్ఎ ఏలూరి సమీక్షకు హాజరైన తహశీల్దారులు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతినిందని, సీఎం చంద్రబాబు వ్యవస్థలను నాశనం చేస్తున్నారని వైసిపి ఇన్‌ఛార్జ్ వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. విజయవాడ పట్టణం నడిబొడ్డున ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంపై దుండగులు దాడి చేయడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని అపకపానే. లా అండ్ ఆర్డర్ నాశనం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేశ్ ప్రమేయంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే అంబేద్కర్ స్మృతివనంను కూలగొట్టాలని చూస్తున్నారని అన్నారు. అది కుదరక ఇప్పుడు అంబేద్కర్ స్మృతివనం నిర్మాణానికి కృషి చేసిన మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరును ధ్వంసం చేశారని అగ్రహారం వ్యక్తం చేశారు. ఈ చర్యలతో బడుగు, బలహీన వర్గాల వారిని భయ భ్రాంతులకు గురి చేయడమే కూటమి ప్రభుత్వ నాయకుల ఎజెండా అని అన్నారు. ఇలాంటి నీచమైన ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

వరికూటి అశోక్ బాబు

శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ ప్రభుత్వంలో దళితులు గర్వపడేలా విజయవాడలో నూతనంగా బారిస్థాయిలో నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శిలాఫలకాన్ని పగలగొట్టిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శిలాఫలకాన్ని పగలగొట్టడాన్ని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల దుస్తులతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నడిబొడ్డున ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సామాజిక మహా శిల్పాన్ని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాత్రి వేళలో శిలా ఫలకాన్ని సుత్తులతో ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. అంబేద్కర్ అందించిన ఫలాలతో హోం మంత్రిగా ఉన్న అనిత తక్షణమే జరిగిన ఘటనపై స్పందించాలని అన్నారు. ఇది రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానంగా భావిస్తున్నామని అన్నారు. తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి వెంకటేశ్వర్లు, అర్బన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు యాదవ్, యాతం మేరిబాబు, గోశాల అశోక్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల అనిల్, చీమకుర్తి బాలకృష్ణ, వాసిమల్ల వాసు, గోశాల అశోక్, హచ్ రమేష్ యాదవ్, శిఖా సురేష్, గోలి గిరి కుమార్, సల్లూరి అనిల్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

'మెరైన్ బోట్' అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి - నిజాంపట్నం

కోస్టల్ మెరైన్ బోటు యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా కన్నా మీరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిజాంపట్నం హార్బర్లో కోస్టల్ మెరైన్ బోటు యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తూనిక కాటాలను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, టీడీపీ మండల అధ్యక్షులు ఒగిబోయిన వెంకట్ యాదవ్‌తో కలిసి నూతన ప్రెసిడెంట్ బొమ్మిడి రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొమ్మిడి రామకృష్ణ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన బోటు ఓనర్స్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బోటు ఓనర్స్‌కు నూతన బోటు యూనియన్ ఎప్పుడు అండగా ఉంటూ సహకారం అందిస్తుందని తెలిపారు. గతంలో కంటే భిన్నంగా మరింత రాయితీలు అందించే విధంగా చేస్తానని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, రాయితీలను మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో అర్హులైన మత్స్యకారులకు పార్టీలకు అతీతంగా అందేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయుడు నరసింహమూర్తి, ఖాదర్ బాబు, కన్నా నరసింహారావు, బొమ్మిడి నరసింహారావు, నందీశ్వరరావు, ఇమ్రాన్ ఖాన్, శీలం కోటేశ్వరరావు, శీలం పవన్, దాసరి బిక్షాలు, బోటు ఓనర్స్, జెట్టి మత్స్య వ్యాపారస్తులు పాల్గొన్నారు.

బోటు యూనియన్ అధ్యక్షులుగా బొమ్మిడి రామకృష్ణ

విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఏలూరి

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని వింజనంపాడులో శుక్రవారం జరిగిన పోలేరమ్మ దేవస్థానం ప్రతిష్ఠలో స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఎతో పాటు టిడిపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఐల బదిలీలు

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 12మంది ఎస్ఐలను వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేయడంతో పాటు మరో ఆరుగురు ఎస్ఐలను విఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్ఐ టి అనిల్‌కుమార్ చందోలు నుండి చెరుకుపల్లికి, కె తిరుపతి రావు జె పంగులూరు నుండి నిజాంపట్నంకు, ఎం శివయ్య కొరిశపాడు నుండి భట్టిప్రోలుకు, జివి చౌదరి యద్దనపూడి నుండి బల్లికురవకు, ఎస్‌కె మహమ్మద్ రఫీ చుండూరు నుండి మేదరమెట్లకు, వై సురేష్ చెరుకుపల్లి నుండి కొరిశపాడుకు, ఎస్ రమేష్ పర్చూరు నుండి చిన్నగంజాంకు, జి సురేష్ వేటపాలెం నుండి ఇంకొల్లుకు, పి సురేష్ సంతమాగులూరు నుండి పర్చూరుకు, డి రత్నకుమారి అద్దంకి నుండి యద్దనపూడికి, ఎ చంద్రశేఖర్ మేదరమెట్ల నుండి ఈపురుపాలెంకు, ఎం వెంకటేశ్వర్లు చీరాల టౌన్ స్టేషన్ నుండి వేటపాలెంకు బదిలీ అయ్యారు.

విఆర్‌కు ఆరుగురు ఎస్ఐలు

నిజాంపట్నం ఎస్ఐ జి శ్రీనివాసరావు, భట్టిప్రోలు ఎస్ఐ కె శ్రీనివాసరావు, బల్లికురవ ఎస్ఐ విఆర్ శంకరరెడ్డి, ఇంకొల్లు ఎస్ఐ ఎస్ మల్లికార్జునరావు, ఈపురుపాలెం ఎస్ఐ ఎంపి శివకుమార్‌లను విఆర్‌కు పంపుతూ ఎస్పీ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎంఎల్ఎ కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

స్థానిక సిలోను కాలనీలోని ముత్తు మారియమ్మ దేవాలయంలో ఆయన శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజల్లో ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. టిడిపి నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన తహశీల్దార్

ప్రజాశక్తి - చీరాల

నూతన తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కె గోపికృష్ణ ఎంఎల్ఎ ఎంఎం కొండయ్యను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో పనిచేసిన తహశీల్దారు నాసరయ్య బదిలీపై వెళ్లటంతో ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. స్థానిక కొత్తపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందచేశారు.

శంకుస్థాపన చేస్తున్న వల్లభనేని బుచ్చయ్యచౌదరి

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - నగరం

స్థానిక వెలకపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో రూసా నిధులతో నూతన భవన నిర్మాణంనకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడారు. రాష్ట్రీయ ఉచ్ఛతర్ సర్వ శిక్షా అభియాన్ రూస నిధులతో కళాశాలలో విద్యార్థులకు నూతన భవన నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను పొందేందుకు రూ.కోటి రుసా నిధులతో కళాశాల ప్రాంగణంలో నూతనంగా భవన నిర్మాణ శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎవి కృష్ణ ప్రసాద్ (ఆర్‌టిఇఇ సొసైటీ వైస్ ప్రెసిడెంట్), డాక్టర్ వసంతం వీర రాఘవయ్య, (ఆర్‌టిఇఇ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్), కె రమణమూర్తి (ఆర్‌టిఇఇ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్) కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారాయణ, కళాశాల ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ అనగాని శ్రీనివాసరావు, కళాశాల సూపరింటెండెంట్ పి అమరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంకొల్లులోని కళ్యాణ మండపం

శ్రావణ మాసం ప్రారంభంతో మోగనున్న భజంత్రీలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈ నెల నాలుగో తారీఖు వరకు ఆషాఢ మాసం కొనసాగింది. అందులో భాగంగా ఇప్పటి వరకు ఎలాంటి శుభకార్యాలు, వివాహాలు, గృహప్రవేశాలు జరగలేదు. అయితే ఆగస్టు 5న మంగళవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమైంది. దీంతో ఈనెలలో గృహ ప్రవేశాలు, గృహ నిర్మాణ శకుస్థాపనలు, పెళ్లిళ్లకు ముహూర్తాలు ఖరారు చేసుకునే వారి సంఖ్య పెరగడంతో కళ్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. జిల్లాతో పాటు ఇంకొల్లు, పరిసరాల్లో గృహప్రవేశాలు ప్రారంభం జరగనున్నాయి. 8, 11, 16, 18, 22తేదీల్లో శుభ ముహూర్తాలు, శుభకార్యాలకు వేదిక కానున్నాయి. గత మూడు నెలలుగా ముహూర్తాలు లేవనే కారణంతో గృహప్రవేశాలు, ఇతర శుభ కార్యాలను వాయిదా వేసుకున్న వారికి శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఉత్సాహం కనిపిస్తుంది. దీంతో అర్చకులతోపాటు కళ్యాణ మండపాలు, అక్కడ పనిచేసే సిబ్బంది, షామియానాల దుకాణాలు, ఇతర అనుబంధ పనులకు పోటీ పెరిగింది. దేవాలయాల్లో శ్రావణ మాసం ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ మాసం ముగించే వరకు ప్రతి శుక్రవారం దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆషాఢ మాసంలో ఎలాంటి కార్యక్రమాలు లేక ఖాళీగా ఉన్న కళ్యాణ మండపాల్లో శ్రావణ మాసం శుభకార్యాలతో బాజా భజంత్రీలు మోగనున్నాయి. పురోహితులకు గిరాకీ రానుంది. కళ్యాణ మండపాలతో పాటు ఫంక్షన్ హాళ్లలో శుభకార్యాలకు గిరాకీ రానుంది. శ్రావణ మాసం నుంచి మరో రెండు నెలల పాటు వివిధ శుభకార్యాలతో పురోహితులు బిజీ కానున్నారు. గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొనున్నది.

ఎస్‌పిని కలిసి హెల్ప్ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - అద్దంకి

నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్ డుడిని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ మేదరమెట్ల టిఐ (టార్గెట్ ఇంటర్వెన్షన్) ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన మండలి సంయుక్తంగా గత రెండు దశాబ్దాలకుపైగా హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు, సెక్స్ వర్కర్లకు వివిధ రూపాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాప్తి చెంద కుండా వివిధ స్థాయిల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ చాప కింద నీరులా వ్యాప్తి చెందుతుందని అన్నారు. భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ 2వ స్థానంలో హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులు ఉన్నారని తెలిపారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ నెల 12 నుండి రెండు నెలల పాటు అవగాహన ఏర్పాటు చేయటానికి జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, రాష్ట్ర ఎయిడ్స్ మండలి ఓ కార్యాచరణ రూపకల్పన చేశారని తెలిపారు. దానికి తమ పోలీస్ సిబ్బంది నుంచి పూర్తిస్థాయి సహాయం సహకారాలు అందించాలని టిఐ మెదరమెట్ల ప్రాజెక్టర్ బివి సాగర్ ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో చీరాల మహిళా మండలి టిఐ ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన హెల్ప్ సంస్థ డైరెక్టర్ సాగర్

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్, ఎల్ఐసి బ్రాంచి ఆధ్వర్యంలో మండలంలోని గురకాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణ ప్రేమికులు, రోటరీ మాజీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు జన్మదిన సందర్భంగా ఆయన సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించినారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రకృతి హితంగా నడవాలని అన్నారు. అప్పుడే మానవుడు నిండు నూరేళ్ళ జీవించగలడని అన్నారు. ఎల్ఐసి అద్దంకి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి మాధవకృష్ణ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి మొక్కలు నాటే అభిరుచి ఏర్పర్చుకోవాలని, అవసరం ఉన్నా, లేకున్నా, అభివృద్ధి పేరిట వృక్ష సంపద తరిగిపోతుందని అన్నారు. ఆ లోటును కేవలం మొక్కలు వేయడం ద్వారానే భర్తీ చేయుటకు వీలుందని అన్నారు. పర్యావరణం పరిరక్షించుటకు విధిగా ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని అన్నారు. ప్రతి సంవత్సరం ఎల్ఐసి ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తాము చేపడుతున్నామని అన్నారు. తమ ఎల్ఐసి ఏజెంట్ అయిన మన్నం త్రిమూర్తులుకు తాము అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాధవ కృష్ణ శ్రావణ శుక్రవారం సందర్భంగా స్కూలు విద్యార్థినిలకు, అక్కడ మహిళా టీచర్లకు 50 తులసి మొక్కలు అందజేశారు. స్కూలు ఆవరణలో జామ, బాదం, లక్ష్మణ ఫలం, గానుగ, వేప, చింత, మునగ మొదలగు మొక్కలు నాటించారు. కార్యక్రమానికి ప్రధాన బాధ్యులైన మన్నం త్రిమూర్తులు, హెచ్ఎం ఎల్ సుజాత, ఎల్ఐసి ఎబిఎం షేక్ ఖాదర్ మస్తాన్, తోటకూర సత్యనారాయణ, కె వినోద్, షేక్ రఫీ, చుండూరు మురళి, మల్లాది శ్రీనివాసరావు, ఎస్‌కె భాష, ఎం కామేశ్వరశర్మ, పిఎటిఎస్ శ్రీనివాసరావు, హై స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ గజ్జల కోటమ్మ, జాగర్లమూడి శ్రీనివాసరావు, నర్రా సుధాకర్, దస్తగిరి పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న దృశ్యం

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి నిషాద్ నాజ్ అన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వాడకంపై లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి నిషాద్ నాజ్ మాట్లాడారు. గంజాయికి యువత బానిసలు అవుతున్నారని అన్నారు. ఈజీ మనీకి అలవాటు పడి యువత గంజాయి క్రయ, విక్రయాలు జరుపుతున్నారని అన్నారు. నేటి యువత రేపటి భావితరల పౌరులను మదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకొని కుటుంబం రోడ్డున పడకుండా కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి రమేష్ బాబు, న్యాయవాదులు ఎ రామకృష్ణ, మహిళా న్యాయవాది జెకె ఈశ్వరి, టూ టౌన్ ఎస్ఐ ఎ వెంకటేశ్వర్లు, విఆర్ఎస్ కాలేజీ విద్యా సంస్థల సీఈఒ రామకృష్ణ, విఆర్ఎస్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి రవికుమార్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి నిషాద్ నాజ్‌హజ

ఎంఎల్‌ఎను కలిసిన తహాశీల్దారు

ప్రజాశక్తి - యద్దనపూడి

నూతన తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళా పోలీసులు కూడా ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ మండల ప్రజల సంక్షేమం కోసం పని చేద్దామని చెప్పారు.

ఎంఎల్‌ఎను అభినందిస్తున్న తహశీల్దారు నాగరాజు

13న దేశభక్తి క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 13న చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో స్వతంత్ర సమరయోధుల పోరాటాలపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎపి సోషల్ స్టడీస్ ఫారం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు గుర్రం మురళీమోహనరావు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పిపిటి ద్వారా 13న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాల నుండి టీంకు ముగ్గురు మాత్రమే అర్హులని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎం, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో పాల్గొనవచ్చని తెలిపారు. 1857 నుండి 1947 వరకు స్వతంత్ర ఉద్యమం గురించి, కరెంట్ అఫైర్స్ రూపంలో క్విజ్ పోటీ జరుగుతుందని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మురళీమోహనరావు

చేనేత రంగానికి వరాలు హర్షనీయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు ప్రకటించిన వరాలపట్ల టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు, బట్టిప్రోలు, అద్దేపల్లి పద్మశాలియ సంఘం అధ్యక్షులు బట్టు మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడారు. చేనేత కార్మికులకు ఆరోగ్య భీమ, గృహ నిర్మాణ పథకం కింద అదనంగా రూ.50వేలు, జీఎస్టీ తొలగింపు, 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు, చేనేత వస్త్రాలు ధరించాలని, చేనేత కార్మికులకు ప్రభుత్వ చేయూతనిస్తుందని ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం చేనేత రంగం బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన వరాలు కార్మికులను ఉత్తేజపర్చిందని అన్నారు. సంక్షోభంలో ఉన్న పరిశ్రమకు కొంత ఊరట లభించిందని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

బట్టు మల్లికార్జునరావు

వైద్య పరీక్షలు చేస్తున్న పిహెచ్‌సి డాక్టర్ కావ్య

లంక గ్రామాల్లో వైద్యశిబిరం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని చిలుమూరులో ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. లంక గ్రామాల్లో విష జ్వరాలు ఎక్కువగా ఉండటంతో కొల్లూరు పిహెచ్‌సి డాక్టర్ కావ్య ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిలువ ఉంచవద్దని సూచించారు. రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని కోరారు. శిబిరంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- అక్షరాస్యత పెంచేందుకు చర్యలు
- గిరిజన మ్యూజియం ఏర్పాటుకు కృషి
- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గిరిజనుల సమగ్ర అభివద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయో వద్ధుల సంక్షేమ, సచివాలయాల శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని గిరిజన భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అంబేద్కర్, ఇతర గిరిజన స్వాతంత్ర్య పోరాట వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత ప్రకాశం భవనం నుండి గిరిజన భవనం వరకు చేపట్టిన ర్యాలీని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ పొన్నలూరు, కనిగిరిలో గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన గురుకులాలలోని పెండింగ్ పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసి విద్యార్థులకు త్వరలో అందుబాటులోకి తెస్తుందన్నారు. అర్హులైన గిరిజనులకు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లాలో గిరిజన మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సంబంధించిన అంచనాలను అధికారులు ఇప్పటికే రూపొందించినట్లు తెలిపారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గిరిజన యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఔషధ శిబిరాన్ని మంత్రి, కలెక్టర్ ప్రారంభించారు. యర్రగొండపాలెం, దోర్నాల, పుల్లలచెరువు మండలాలలోని అర్హులైన 383 మంది చెంచులకు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్.సి. కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, ఎస్.సి., ఎస్.టి., జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పి.లక్ష్మయ్య, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యనారాయణ, మాల్యాద్రి, సైదా నాయక్, మోగన్న, స్థానిక కార్పొరేటర్ నాగభూషణం పాల్గొన్నారు.

చెంచులకు పట్టాలు అందజేస్తున్న మంత్రి స్వామి

మాట్లాడుతున్న బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి

బాపట్ల జిల్లా: ఎస్టీల జీవితాలలో వెలుగులు నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో ఘనంగా జరిగింది. తొలుత బాపట్ల పట్టణంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్, శాసనమండలి చీఫ్ విప్ కలిసి జ్యోతి వెలిగించారు. ఏకలవ్యుడు చెంచులక్ష్మి అంబేద్కర్ సేవాలాల్ మహారాజ్ వెన్నెల గంటి రాఘవయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ శాసనమండలి చీఫ్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి రవీందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి రాజా దిబోరా, గిరిజన నాయకులు మోహన్ కుమార్ ధర్మ, రాఘవయ్య, డి బ్రహ్మం, శివ శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి

ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గస్తీ విధులు నిర్వహించే పోలీసులు అనుమానితులను క్షుణ్ణంగా విచారించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీస్ అధికారులు సిబ్బంది ముమ్మరంగా గస్తీ విధులు నిర్వహిస్తున్నారు. రాత్రివేళలలో బైక్‌లపై షికారులు చేస్తున్న యువకులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా విచారించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి, మద్యం ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాతనేరస్థులు, చెడునడత కలిగిన వ్యక్తులను విచారిస్తున్నారు. ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడానికి గస్తీ విధులు ముమ్మరం చెయ్యాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది గస్తీ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. పాత నేరస్థులు, చెడునడత కలిగిన వ్యక్తులను తనిఖీ చెయ్యాలన్నారు. అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా విచారించాలన్నారు.